సాక్షి ఆదిలాబాద్

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



తప్పిన గజరాజు గండం

గజరాజు గండం ముగిసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసిన ఏనుగు ఎట్టకేలకు ప్రాణహిత నది దాటింది. IIలో▸

రంజాన్ వేళలు

శని — ఇఫ్తార్ 6:32

ఆది — సహర్ 4:42

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /27.0

మధ్యాహ్నం ఎండ వేడిమి అధికంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో, జెడ్పీ క్యాంప్ కార్యాలయ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కలెక్టర్ రాజర్షి షా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునితకుమారి, కార్పొరేషన్ ఈడీ శంకర్, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఓటు వజ్రాయుధం

బజార్‌హత్నూర్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. మండలకేంద్రంలో కొత్త ఓటర్ల నమోదుపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యువజన, క్రీడల విభాగం జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి మోహన్‌నాయక్, మెడికల్ ఆఫీసర్ భీంరావ్, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: క్రోధి నామ ఉగాది సందర్భంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లాకు చెందిన కవులు, రచయితలు నిమ్మల ప్రశాంత్, అంపెల్లి లక్ష్మి నారాయణ, నాగోరావ్ పాటిల్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కవులు సామాజిక అంశాలపై కవితలు చెప్పవచ్చని తెలిపారు. వివరాలకు 98486 43669, 9346727719, 7892947889 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కార్పొరేట్ గాలం



'హలో.. నమస్కారమండి.. మీ పాప/బాబు పదో తరగతి అయిపోయింది కదండి.. ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు.. మాది కార్పొరేట్ కాలేజ్. ఐఐటీ.. మెయిన్స్.. అడ్వాన్స్.. ఏసీ.. నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లున్నాయి. ఇప్పుడు జాయిన్ అయితే డిస్కౌంట్ కూడా ఇస్తున్నాం.. రిజల్ట్స్ వచ్చాక సీట్లు ఉండవు. ఫీజులు పెరుగుతాయి.. మీ ఇష్టం.. ఆలోచించుకొండి..' ఇది జిల్లాలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు రోజూ వస్తున్న ఫోన్‌కాల్స్. ఇలా ఇంటర్ కాలేజీల యాజమాన్యాలు ప్రత్యేకంగా పీఆర్‌వోలను నియమించుకొని ప్రవేశాల కోసం గాలం వేస్తున్నాయి.

- 'పది' పరీక్షలు రాసిన విద్యార్థుల ఇంటిబాట పట్టిన పీఆర్వోలు
- ఫలితాలు రాక ముందే ఇంటర్ అడ్మిషన్ల వేట
- నిబంధనలు పాటించని ప్రైవేట్ కళాశాలలు

ఆదిలాబాద్‌టౌన్: తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. కూలీనాలి చేసైనా మంచి కళాశాలలో చదివించాలనే ఆలోచనలో ఉన్నారు. దీనిని ఆసరాగా చేసుకొని అందినకాడికి దోచుకునేందుకు కార్పొరేట్ కళాశాలలు సిద్ధమవుతున్నాయి. అందించేది అరకొర విద్యే అయినప్పటికీ.. ఆకట్టుకునేలా బ్యాచ్‌కో పేరు పెట్టి.. రంగురంగుల బ్రౌచర్లు చూపి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. వీరి మాయమాటలు నమ్మి చాలా మంది తల్లిదండ్రులు స్థిరాస్తులు సైతం అమ్ముకొని పిల్లలను చదివిస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్ష ఫలితాలు రాక ముందే నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల వేట ప్రారంభించాయి.

బంపర్ ఆఫర్లతో ఆకట్టుకునేలా..

ఆయా కళాశాలలు నియమించుకున్న పీఆర్వోలు విద్యార్థుల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. మూడు నెలల ముందు నుంచే ఈ తతంగం మొదలైంది. వీరు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామా ఇప్పటికే సేకరించారు. వివరాలు ఇచ్చినందుకు ఆయా పాఠశాలల యాజమాన్యాలకు విందులు, నజరానాలు సమకూర్చుతున్నారు. నిబంధన ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవరికీ ఇవ్వరాదు. కానీకాసులకు కక్కుర్తిపడి కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఈవిధంగా వ్యవహరిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన పలు కళాశాలల వారు జిల్లాలో 50 మంది వరకు పీఆర్‌వోలను నియమించుకున్నారు. వారు ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బ్రోచర్లు ఇవ్వడం, వారి కళాశాలల్లో ఇచ్చే బోధన, వసతులు, ఏసీ క్యాంపస్‌లు, తదితర విషయాలను వివరిస్తూ వారిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో..
జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 13
మోడల్, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీలు, మహాత్మా జ్యోతిబాపూలే, ప్రభుత్వ యాజమాన్య కళాశాలలు 45
ప్రైవేట్ కళాశాలలు 14

టార్గెట్ పెడుతూ..

కొన్ని యాజమాన్యాలు పీఆర్వోలను ప్రత్యేకంగా నియమించుకొని ఏడాది పాటు వేతనాలు ఇస్తున్నాయి. అడ్మిషన్లు ఎక్కువగా చేసిన వారికి ఇన్సెంటివ్‌లు సైతం అందజేస్తున్నాయి. మరోవైపు సంబంధిత కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర అధ్యాపకులు, సిబ్బంది తప్పకుండా ప్రతి ఒక్కరు 25 చొప్పున ఆ కళాశాలలో అడ్మిషన్లు తీసుకురావాలని టార్గెట్లు పెట్టారు. వేసవిలో తరగతులు ఉండకపోవడంతో వారికి సగం వేతనమే చెల్లిస్తున్నారు. ప్రవేశాలు చేసిన వారికి మాత్రం ఇన్సెంటివ్, కొంత కమీషన్ ఇస్తున్నారు. లెక్చరర్లు, ఇతరులు ఎవరైనా అడ్మిషన్లు చేస్తే సాధారణ కళాశాలకు రూ.వెయ్యి, కార్పొరేట్ కళాశాలకు రూ.5వేల వరకు, హాస్టల్ క్యాంపస్ ఉన్న కళాశాలల్లో చేర్పిస్తే రూ.2500 అందజేస్తున్నారు. కాగా, ఈ డబ్బంతా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నది కావడం గమనార్హం.

భారీగా ఫీజులు..

హైదరాబాద్‌లోని కార్పొరేట్‌కు సంబంధించి జిల్లా నుంచి ఏటా వెయ్యి నుంచి 2వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. ఐఐటీ, నీట్, ఏసీ సౌకర్యాలు ఉన్న కళాశాలల్లో ఏడాదికి రూ.3లక్షలు, సాధారణ చదువుకు రూ.1లక్ష 50వేల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని కార్పొరేట్ కళాశాలలు సైతం రూ.లక్షకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన లెక్చరర్ల ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను సర్కారు కళాశాలల్లో చేర్పించాలి. అడ్మిషన్‌తో పాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సైతం ఉచితంగా అందిస్తున్నాం. స్కాలర్‌షిప్ కూడా పొందవచ్చు.

– రవీంద్రకుమార్, డీఐఈవో

నిబంధనలకు విరుద్ధంగా..

పదో తరగతి పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత మే, జూన్‌లో అడ్మిషన్లు ప్రారంభించాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తున్నా విద్యా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెరిగిన ఓటర్లు

సంవత్సరం	నియోజకవర్గం	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు	ఇతరులు	పోలింగ్ కేంద్రాలు
2019	ఆదిలాబాద్	1,11,021	1,08,584	7	280
	బోథ్	98,633	94,737	3	300
2024	ఆదిలాబాద్	1,24,375	1,19,154	6	290
	బోథ్	1,08,580	1,02,333	2	302

- జిల్లాలో ఐదేళ్లలో 41వేల మంది..
- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెంపు



కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఓటరు తుది జాబితా ప్రకటించింది. 2019 ఎంపీ ఎన్నికలతో పోల్చితే జిల్లాలో ప్రస్తుతం ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. గడిచిన ఐదేళ్లలో 41,467 మంది కొత్తగా పెరిగారు. ఇందులో పురుషులతో పోల్చితే మహిళలే అధికంగా ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా స్వీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఓటు అవశ్యకత తెలియజేసేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తుండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

ఐదేళ్లలో 41వేల మంది..

2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో మొత్తం 4,12,975 ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,03,321 మంది, మహిళలు 2,09,654 మంది ఉన్నారు. ఇటీవల అధికారులు ప్రకటించిన జిల్లా ఓటర్ల తుది జాబితా ప్రకారం 4,54,442 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 2,21,487 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,32,955 మంది ఉన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. గడిచిన ఐదేళ్లలో 41,467 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో ఆదిలాబాద్ నియోజకర్గంలో 23,924 మంది, బోథ్ నియోజకవర్గంలో 17,594 మంది ఓటర్లు పెరిగారు. కాగా 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 14వరకు గడువు ఉండటంతో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఇక ఇతరుల విషయానికి వస్తే వారి సంఖ్య ఐదేళ్లలో తగ్గింది. గత ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా పది మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 8 మందే ఉన్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ఒక్కొక్కరు చొప్పున తగ్గారు.

పెరిగిన కేంద్రాలు

2019 ఎన్నికలతో పోల్చితే ఓటర్ల సంఖ్యతోపాటు జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా పెరిగింది. నాడు పోలింగ్ కేంద్రాలు 580 ఉండగా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల సంఖ్యకనుగుణంగా వీటిని 592కు పెంచారు. ఒక్కో కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1500కు దాటకుండా వీటిని పెంచినట్లు అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో గతంతో పోల్చితే 10 కేంద్రాలను పెంచగా, బోథ్ నియోజకవర్గంలో మరో రెండింటిని పెంచారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు సౌకర్యవంతంగా రెండు కిలోమీటర్ల లోపు పోలింగ్ కేంద్రం ఉండాలనే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో మరికొన్ని కేంద్రాలు అదనంగా పెరిగే అవకాశముంది.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి

కైలాస్‌నగర్: జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని డీపీఆర్వో తిరుమల ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఫారం 12 డితో పాటు అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ ప్రతిని జతచేసి ఈ నెల 6, 7 తేదీల్లో సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. జర్నలిస్టు పేరు, మీడియా పేరు, హోదా, సెగ్మెంట్ల పేరు, పోలింగ్ బూత్‌నంబర్, పార్ట్‌నంబర్, మొబైల్ నంబర్ వంటి వివరాలు నమోదు చేసి ఎపిక్ కార్డ్, అక్రిడిటేషన్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో దరఖాస్తులు అందించాలని సూచించారు. పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహించే 13 శాఖల సిబ్బందితో పాటు జర్నలిస్టులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా
- పలు గ్రామాల్లో పర్యటన



ఉమ్రి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి సమస్య తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని ఉమ్రి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, మిషన్ భగిరథ నీరు రెండు మూడు రోజులకోసారి వస్తున్నట్లు వివరించారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, శాశ్వత పరిష్కారం కోసం సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ని ఆదేశించారు. ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం ఉట్నూర్ సీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట డీడీ దిలీప్‌కుమార్, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

బుర్సన్‌పటర్‌లో..

ఇంద్రవెల్లి: మండలంలోని రాంజీగూడ గ్రామ సమీపంలో ఉన్న బావిని కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. అనంతరం బుర్సన్‌పటర్‌లో నీటి సమస్య పరిష్కారంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి గ్రామస్తులతో మాట్లాడారు. ఏటా వేసవిలో నీటి సమస్య వస్తుందని, మరో బావి మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ప్రస్తుతం స్పెషల్ ఫండ్ కింద మంజూరై ఉన్న రూ.5 లక్షలతో రాంజీగూడ బావి నుంచి బుర్సన్‌పటర్ వరకు ఉన్న పైపులైన్ మరమ్మతు చేయించి నీటి వసతి కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. కోడ్ కారణంగా ప్రస్తుతం కొత్త బావి మంజూరు సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా మంజూరైన రూ.3లక్షల 60వేలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. ఉన్నత చదువుతో వారి భవిష్యత్ ఉజ్వలంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేశ్, డీఈ శ్రీనివా స్, ఏఈ భానుకుమార్, పీఆర్ జేఈ లింగన్న, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, ఎంఈవో నారాయణ తదితరులున్నారు.

పంటల బీమా.. అన్నదాతకు ధీమా

- 'వానాకాలం' నుంచి పథకం అమలుకు కసరత్తు
- లోపాలు సరిదిద్దితే రైతులకు మరింత ప్రయోజనం

నేరడిగొండ: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంటల బీమా పథకం) అమలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. వానాకాలం సీజన్ నుంచి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పథకం అమలైతే ఏటా వడగండ్లు, అకాల వర్షాలతో చేతికంది వచ్చిన పంటలు నష్టపోతున్న జిల్లాలోని అన్నదాతలకు బీమాతో ధీమా చేకూరనుంది.

ఆదుకునేవారే కరువు..



గతేడాది కురిసిన వర్షాలకు నీటమునిగిన పంటలు (ఫైల్)

2019 నుంచి జిల్లాలో పంటల బీమా పథకం అమలు కావడం లేదు. దీంతో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేవారే కరువయ్యారు. పంటలు నష్టపోయిన సమయంలో ప్రభుత్వం ప్రాథమిక సర్వేతోనే సరిపెడుతోంది. కొన్నిసార్లు రైతు వారీగా సర్వే చేసేందుకు వ్యవసాయ శాఖ ముందుకు రాని పరిస్థితి ఉంది. దీనికితోడు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కురిసిన వడగండ్లతో జిల్లాలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ఈ పథకం అమలులో లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ప్రీమియం చెల్లింపు ఇలా..

ఐదేళ్లకు ముందు ఆహార పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాణిజ్య పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలు వర్తించాయి. పంటల బీమా పథకం అమలు సమయంలో ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం చొప్పున ప్రీమియం రైతులు చెల్లించగా మిగతా సగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాయి. అప్పట్లో ఎక్కువ పంట సాగు చేసిన ప్రాంతాల్లో గ్రామం యూనిట్‌గా, తక్కువ విస్తీర్ణం సాగైన చోట మండలం యూనిట్‌గా, అత్యల్పంగా సాగు చేసిన ప్రాంతాల్లో జిల్లా యూనిట్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. పంట కోత ప్రయోగాల ఆధారంగా రైతులకు బీమా పరిహారం చెల్లించేవారు.

లోపాలు సరిదిద్దితే మరింత ప్రయోజనం

ఈ పథకం అమలులో లోపాలుండడంతో అన్నదాతల కంటే బీమా కంపెనీలే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నాయనే ఉద్దేశంతో.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకం అమలు నుంచి తప్పుకొని రైతులకు ఐచ్ఛికం చేసింది. పంటల కోత ప్రయోగాల ఆధారంగా కాకుండా ఒక్కోరైతు కమతాలను యూనిట్‌గా పరిగణించాలని కోరుతున్నారు. ప్రస్తుత కాలంలో పంట నష్టాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ప్రతి గ్రామంలో వాతావరణ సమాచార నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి వర్షపాతం నమోదు చేపట్టాలని కోరుతున్నారు. కాగా, పంటల బీమా పథకం అమలు కోసం రైతుల ప్రీమియం వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని మంత్రులు చెబుతున్నారు. ఇది కార్యరూపం దాల్చితే రైతులకు భరోసా ఏర్పడుతుంది.

జిల్లాలో..	సాగు విస్తీర్ణం 3,52,262 హెక్టార్లు
రైతుల సంఖ్య 1,54,731	

సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ నుంచి ఫసల్ బీమా పథకాన్ని అమలుచేస్తామని చెప్పడం ఎంతో సంతోషకరం. గత ప్రభుత్వ హయాంలో ఫసల్ బీమా లేక పంటలు దెబ్బతింటే ఎంతో నష్టం జరిగింది.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, తేజాపూర్

ఆదేశాలు రాగానే అమలు



ఫసల్ బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తాం.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి

బదిలీ చర్యలు చేపట్టండి..

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ..
- జిల్లా ఉపాధి కల్పన అధికారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు
- పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఈసీ నుంచి కలెక్టర్‌కు ఆదేశం



మిల్కా, ఆదిలాబాద్ జిల్లా ఉపాధి కల్పనశాఖ ఇన్‌చార్జి అధికారి

సాక్షి, ఆదిలాబాద్: దీర్ఘకాలంగా ఆదిలాబాద్ జిల్లాలో అధికారిగా విధులు నిర్వహిస్తున్న మిల్కా నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల సమయంలోనూ బదిలీ నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపిస్తూ మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ఎస్.రాజేందర్‌గౌడ్ న్యూ ఢిల్లీలోని చీఫ్ ఎలక్షన్ కమిషన్, హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్‌లో ఏసీడీపీవో హోదాలో కలిగిన ఈ అధికారి ఇన్‌చార్జి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. మార్చి 19న ఈ ఫిర్యాదు చేయగా దీనిపై ఎస్‌ఈసీ స్పందించింది. ఫిర్యాదుపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్‌ను ఆదేశించింది. ఇదిలా ఉంటే వివిధ శాఖల్లో కొంత మంది అధికారులు జిల్లాలో దీర్ఘకాలికంగా కొనసాగుతుండటం గమనార్హం.

గతంలో ప్రజావాణిలోనూ ఫిర్యాదు

మందమర్రికి చెందిన రాజేందర్‌గౌడ్ గతంలో జిల్లా ఉపాధి కల్పన అధికారిపై ఆదిలాబాద్ ప్రజావాణిలోనూ అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల వివరాలపై తాను ఆర్‌టీఐలో అడిగినప్పుడు వివరాలు ఇవ్వడం లేదని అందులో పేర్కొన్నారు. ఏసీడీపీవో హోదా కలిగిన మిల్కా ఇదివరకు ఐసీడీఎస్‌లో జిల్లా సంక్షేమాధికారిగా కొనసాగారు. దాంతోపాటు జిల్లా ఉపాధి కల్పన అధికారిగా కొంత కాలంగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఐసీడీఎస్‌కు రెగ్యులర్ అధికారి రావడంతో ఆమె ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. కాగా జిల్లా ఉపాధి కల్పన అధికారిగా కొనసాగుతూనే వస్తున్నారు. ఇదిలా ఉంటే దీర్ఘకాలికంగా ఆమె ఈ జిల్లాలోనే పనిచేస్తున్నారని, ఎన్నికల సమయంలోనూ పలుకుబడితో పైరవీలు చేసి బదిలీ నుంచి తప్పించుకున్నారని ఫిర్యాదుదారు ఈసీకి వివరించారు. ఈ క్రమంలంఓ ఇటీవల కలెక్టర్‌కు ఈసీ నుంచి ఈ ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది అధికార వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

నీటి ఎద్దడి కట్టడికి చర్యలు

- మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని రాంనగర్, న్యూహౌసింగ్‌బోర్డు కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మున్సిపల్ అధికారులు, వార్డు ప్రత్యేకాధికారులతో కలిసి ఆయా కాలనీల్లోని చేతి పంపులను పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజు విడిచి రోజు సరఫరా అవుతుందని, అలాగే చేతి పంపులు మరమ్మతుకు గురై నీటికి ఇబ్బందులు పడుతున్నట్లు కొంతమంది కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పాడైపోయిన చేతిపంపులన్నింటికీ మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ట్యాంకర్ల ద్వారానూ నీటిని అందజేస్తున్నట్లుగా తెలిపారు. ప్రజలు నీటి సమస్యతో ఎదైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వాటిపై యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు యూనుస్, అనురాధ, సాయి కిరణ్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.



చేతిపంపును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

క్లుప్తంగా

బాసరలో నగర సంకీర్తన



సంకీర్తన చేస్తున్న సంఘం సభ్యులు

భైంసా: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో పూర్వకాలంలో చేసినట్లు సంకీర్తన కార్యక్రమాన్ని ప్రతీగ్రామంలో కొనసాగిస్తామని వ్యాసపురి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పూజారి వెంకటేశ్ తెలిపారు. బాసరలో శుక్రవారం నగర సంకీర్తన నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా హరిజనవాడ మారెమ్మ ఆలయం నుంచి ప్రారంభించారు. లోకకల్యాణార్థం చేపట్టిన కార్యక్రమంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. దైవస్మరణ, ధర్మ పరిరక్షణ, సమాజంలో ఐకమత్యం కోసం సంకీర్తనలో అందరూ పాల్గొనాలని వారు పేర్కొన్నారు.

కారు బోల్తా



ప్రమాదానికి గురైన కారు

భైంసా: బాసర సమీపంలో భైంసా–నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన శుక్రవారం కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టి రోడ్డుపక్కన పడిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న మహారాష్ట్రవాసులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

గుడుంబా పట్టివేత

సారంగపూర్: మండలంలోని సాయినగర్‌తండాలో శుక్రవారం గుడుంబా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో ఏఎస్సై వసంత్, హెడ్‌కానిస్టేబుల్ సూర్యకాంత్, మహిళా కానిస్టేబుల్ అష్న కలిసి గ్రామంలో దాడి చేసి ఒకరిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద 11 లీటర్ల గుడుంబా లభ్యమైందని ఎస్సై చంద్రమోహన్ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గుడుంబాను పోలీసుస్టేషన్ తరలించి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారి వద్ద సీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. పోచంపల్లి రఘునందన్ నిర్మల్ నుంచి పీచర వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా రూ.1.44 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్సై నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, పీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ వద్ద శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ. 3.20 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ తాలూకా నాకా గ్రామానికి చెందిన అరుణ్ కలామ్ ఖురేషి తన కారులో వెళ్తుండగా తనిఖీ చేశామన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

తప్పిన గజరాజు గండం

- ఎట్టకేలకు ప్రాణహిత నది దాటిన ఏనుగు
- పెంచికల్‌పేట్ మండలంలో 36 గంటలపాటు సాగిన సెర్చ్ ఆపరేషన్
- డ్రోన్‌ల సహాయంతో ప్రత్యేక బృందాల గాలింపు
- ఫలించిన అటవీశాఖ అధికారుల కృషి
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు



డ్రోన్‌ల ద్వారా గాలిస్తున్న ప్రత్యేక బృందాలు



మురళీగూడ రహదారి వద్ద ఏనుగు



డ్రోన్ సిద్ధం చేసుకుంటున్న సభ్యుడు

పెంచికల్‌పేట్(సిర్పూర్): గజరాజు గండం ముగిసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ఏనుగు ఎట్టకేలకు ప్రాణహిత నది దాటింది. శుక్రవారం నుంచి పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం, జిల్లెడ, మురళీగూడ గ్రామ సమీపంలో ఏనుగును గుర్తించి అటవీశాఖ అధికారులు, ప్రత్యేక బృందాలు, పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించారు. ఫలితంగా ఏనుగు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్ర అడవుల్లోకి ప్రవేశించింది. పెంచికల్‌పేట్ మండలంలో 36 గంటలపాటు కొనసాగిన గజరాజు సెర్చ్ ఆపరేషన్ ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బూరెపల్లి టు మురళీగూడ

ఈ నెల 3న మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది దాటి వచ్చిన ఏనుగు బూరెపల్లి గ్రామ శివారులో పంట చేనులో అల్లూరి శంకర్‌పై ఒక్కసారిగా దాడి చేసి హతమార్చింది. అక్కడి నుంచి ఖర్జెల్లి, రుద్రాపూర్, సులుగుపల్లి గ్రామాల మీదుగా పెంచికల్‌పేట్ మండలంలోకి ప్రవేశించింది. ఈ నెల 4న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామ సమీపంలోకి వచ్చింది. అక్కడ తెల్లవారుజామున వరి పొలానికి నీటిని అందించేందుకు వెళ్తున్న కారు పోశన్నను తొక్కి చంపింది. ఇద్దరు రైతులు ఏనుగు దాడిలో మృత్యువాత పడటంతో అటవీశాఖ అధికారులు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. 144 సెక్షన్ విధించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఏనుగును గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డ్రోన్‌ల సహాయంలో గాలింపు ముమ్మరం చేశారు. కొండపల్లిలో రైతును హతమార్చిన అనంతరం ప్రత్యేక బృందాలు డ్రోన్‌ల సహాయంతో గాలించినా గురువారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. మళ్లీ రాత్రి ఎనిమిది గంటల తర్వాత లోడుపల్లి– పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై కొండపల్లి టర్నింగ్ వద్ద ఆర్టీసీ బస్సుకు ఎదురైంది. రాత్రిపూట గజరాజు కదలికలను గుర్తించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

కమ్మర్‌గాంలో ప్రత్యక్షం

లోడుపల్లి వద్ద సంచరించిన ఏనుగు శుక్రవారం ఉదయం కమ్మర్‌గాం గ్రామ సమీపంలోని పల్లె ప్రకృతి వనం వద్ద ప్రత్యక్షమైంది. దానిని చూసిన గ్రామస్తులు హడలిపోయి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. లోడుపల్లి, మెరెగూడ నుంచి అటవీప్రాంతం నుంచి గుండెపల్లి మీదుగా కమ్మర్‌గాం చేరుకున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ప్రత్యేక బృందాలు డ్రోన్‌ల సహాయంలో మురళీగూడ మునలమ్మ గుట్టపై తిరుగుతున్నట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మురళీగూడ నుంచి కమ్మర్‌గాం వస్తున్న ఆటోకు ఎదురురావడంతో అందులోని ప్రయాణికులు, డ్రైవర్ ఆటో వదిలేసి పారిపోయారు. ప్రత్యక్ష సాక్షుల సహాయంతో అధికారులు ఏనుగు పాదాల గుర్తులను పరిశీలిస్తూ జిల్లెడ గ్రామ సమీపంలోకి చేరుకున్నారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో మురళీగూడ సమీపంలోని పాలకుంట వద్ద ఏనుగును అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతోపాటు స్థానిక అటవీశాఖ అధికారులు, పోలీసులు సమన్వయంతో ఏనుగును సురక్షితంగా ప్రాణహిత నదిని దాటించటానికి ప్రణాళికలు రూపొందించారు. దానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ సుమారు 14 గంటల పాటు కమ్మర్‌గాం నుంచి మురళీగూడ వరకు ఈ ఏనుగు అనుసరించారు. రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్రలోని చిన్నవట్ర అటవీ ప్రాంతంలోకి ఏనుగు వెళ్లిపోవడంతో అధికారులు ఊపరి పీల్చుకున్నారు.

గ్రామాల్లో భయం భయం

ఏనుగు సంచారంతో మూడు రోజులపాటు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం మండలాల ప్రజలు భయం భయంగా గడిపారు. పంట చేలు, రోడ్లపై తిరుగుతుండటంతో గిరిజన గ్రామాల్లో బయటికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి ఏనుగు నది తీరం దాటిపోయిందని అధికారులు నిర్ధారించడంతో సరిహద్దులోని గిరిజన గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఇద్దరి ప్రాణాలు పోయాయి



వన్యప్రాణుల దాడులతో భయం భయంగా గడుపుతున్నాం. ఇప్పటికే కొండపల్లి గ్రామంలో పెద్దపులి, ఏనుగు దాడుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వన్యప్రాణుల దాడుల సమయంలో హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఇకనైనా ప్రజల రక్షణకు చర్యలు చేపట్టాలి.

– మెంగబోయిన పోశన్న, కొండపల్లి, మం.పెంచికల్‌పేట్

బైక్ వదిలేసి పరుగెత్తాం



గురువారం రాత్రి సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట్ వస్తుండగా లోడుపల్లి అటవీ ప్రాంతంలో ఏనుగు ఎదురైంది. భయంతో బైక్ వదిలేసి వెనక్కి పరుగెత్తాం. ఆర్టీసీ బస్సు ఎదురుకావడంతో ఏనుగు వెళ్లిపోయింది. ప్రయాణికుల సాయంతో బైక్ తీసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పెంచికల్‌పేట్ చేరుకున్నాం.

– డోకె రవి, పెంచికల్‌పేట్

రూ.50లక్షల పరిహారం చెల్లించాలి



అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి. గతంలో పెద్దపులి దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేవలం రూ.5 లక్షలు చెల్లించి చేతులు దులుపుకున్నారు. బాధిత కుటుంబాల్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

– కోట సతీశ్, మురళీగూడ మం.పెంచికల్‌పేట్

గంజాయి విక్రయదారుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పట్టుకున్నామని టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానం రావడంతో ఖానాపూర్‌కు చెందిన షాబాజ్‌ఖాన్‌ను తనిఖీ చేయగా 70 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు పేర్కొన్నారు. ఆయన్ను అరెస్టు చేసి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి



స్వర్ణలత(ఫైల్)

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని జీఎన్ఆర్ కాలనీకి చెందిన స్వర్ణలత వడదెబ్బతో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణలత (45)గత రెండు రోజుల క్రితం బంధువుల వివాహానికి నిజామాబాద్‌కు వెళ్లింది. ఎండల తీవ్రత కారణంగా ఆమెకు వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురైంది. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ ంమధ్యలో మృతి చెందింది. స్వర్ణలత భర్త గంగా ధర్ ప్రభుత్వ ఉద్యోగి. వీరికి ముగ్గురు కుమార్తెలు ప్రత్యాయది ఇటీవలే పదో తరగతి పూర్తయింది. జయంతిక 8వ తరగతి చదువుతోంది. వైష్ణవి 2వ తరగతి చదువుతోంది. ముగ్గురు పిల్లలు తల్లిలేనివారయ్యారు. స్వర్ణలత మృతదేహంపై పడి 'అమ్మ లే అంటూ..' ఏడవడం అందరినీ కదిలించింది.

యువకుడి మృతి



సాయికుమార్(ఫైల్)

బోథ్(నేరడిగొండ): బోథ్ మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన యువకుడు సాయికుమార్ (21) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ రోజువారి కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం అతడు గ్రామంలోని ఓ శుభకార్యానికి వెళ్లాడు. నీరు తాగిన వెంటనే అక్కడికక్కడే పడిపోయాడు. గమనించిన స్థానికులు బోథ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యన మృతిచెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాయఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో గోడం నగేశ్

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. మండలంలోని ధార్మిక్‌నగర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నారాయణపూర్ తాజా మాజీ సర్పంచ్ జాదవ్ పరశురాం, వాంకిడి ఎంపీటీసీ సుజాత బలరాం జాదవ్‌లు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా గోడం నగేశ్ మాట్లాడుతూ వరుస చేరికలతో పార్టీ రోజురోజుకు బలంగా మారుతుందన్నారు. దేశవ్యాప్తంగా అన్నివర్గాల వారు ముక్తకంఠంతో కోరుతున్న పేరు నరేంద్ర మోదీ అని అన్నారు. అందరు సమష్టిగా పనిచేసి విజయం సాధిద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పార్టీ నాయకులు బాబారావ్ పటేల్, తాంసి జెడ్పీటీసీ రాజు, బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ త్రిత్రే నారాయణ సింగ్, మాజీ ఎంపీపీ సాబ్లే ప్రేమ్ సింగ్, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, సాబ్లే సంతోష్ సింగ్, తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బెల్టుషాపుపై దాడి



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఎదులాపురం: పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని బెల్టుషాపుపై టూటౌన్ పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించారు. పక్కా సమాచారంతోనే బెల్ట్‌షాపుపై దాడి చేసి అక్రమ మద్యం విక్రయిస్తున్న అదే కాలనీకి చెందిన గణపతి మధుకర్ రాజ్ పట్టుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.14 వేల విలువ చేసే 18 లీటర్ల 300 ఎంఎల్ అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై లాల్‌సింగ్ నాయక్, పోలీసు సిబ్బంది కిషన్, నరేశ్, హరీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు ఖాతాను ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు

ఆదిలాబాద్‌టౌన్: సైబర్‌నేరగాళ్లు ఏకంగా ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులను ఖాళీ చేశారు. పట్టణంలోని గంజ్‌రోడ్‌కు చెందిన మహెబూబ్‌ఖాన్ బ్యాంకు అకౌంట్‌ను హ్యాక్ చేశారు. గతనెల 22 నుంచి 26వ తేదీ వరకు ఆయన ఖాతాలో రూ.2లక్షల 40వేలు నగదును దోచుకున్నారు. ధనలక్ష్మి లాడ్జి సమీపంలోని ఎస్బీఐలో ఆయన ఖాతా ఉంది. ఈనెల 27న డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లగా అకౌంట్ ఖాళీగా ఉండడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. శుక్రవారం బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణారెడ్డి వివరించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

దండేపల్లి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన రెండు చోరీ కేసులను పోలీసుల గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శ్రీమాల్గాం మల్లన్న ఆలయంలో హుండీ డబ్బులతో పాటు వెండి ప్రతిమలు, గ్రామానికి చెందిన షేక్ హాజీ ట్రాలీ ఆటో బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ట్రాలీ ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య, పత్తి కనకరాజు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకుని విచారించగా, దండేపల్లిలో బుధవారం రాత్రి తామే చోరీలకు పాల్పడ్డట్లు ఒప్పుకొన్నారు. దీంతో వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారు ఎత్తుకెళ్లిన ట్రాలీ ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

బాసరలో భక్తుల రద్దీ



పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

భైంసా: బాసర ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ఇష్టమైనవారం, సెలవుదినం కలిసిరావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఒడ్డున ఉన్న శివాలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి చేరుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆలయంలో పూజలు..

బాసర సరస్వతీ అమ్మవారిని జిల్లావాసి, రాష్ట్రప్రణాళిక శాఖ సంయుక్త కార్యదర్శి శివలింగయ్య శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయన తన కుమారుడు రుత్విక్‌కు అక్షరాభ్యాసం చేయించి, ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ మావోయిస్టుకు రివార్డు



అరుణ, సత్వాజీ దంపతులకు చెక్కు అందిస్తున్న ఐజీ సుమతి

నిర్మల్: జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టుల సంక్షేమానికి సహకరిస్తామని ఇంటలిజెన్స్ ఐజీ సుమతి తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన మాజీ మావోయిస్టు వైదుగుల అరుణకు రూ.10 లక్షల రివార్డును హైదరాబాద్‌లో గురువారం అందించారు. అరుణ, సత్వాజీ దంపతులకు తన కార్యాలయంలో ఈ రివార్డుకు సంబంధించిన చెక్కును అందజేశారు.

2019లో లొంగిపోయి..

మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడిగా చేసిన సత్వాజీ, జార్ఖండ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా చేసిన అరుణ వీరిద్దరూ 2019లో జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అప్పట్లో అరుణపై ప్రకటించిన రివార్డును ఇన్నేళ్ల తర్వాత పోలీసుశాఖ అందజేసింది. అరుణ, సత్వాజీ దంపతులు తమ కుమార్తెతో కలిసి ఈ రివార్డును అందుకున్నారు.

సెలవు రోజుల్లోనూ విధులు

- తాగునీటి ఎద్దడిపై ఆరా



కార్యదర్శులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుంటున్న డీపీవో

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారులు సెలవు రోజు సైతం విధులను నిర్వహించారు. జిల్లాలో ఎండల తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఫలితంగా పలు గ్రామాల్లో ఇప్పటికే నీటిఎద్దడి తలెత్తి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితి లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో డీపీవో శ్రీలత, డీఎల్‌పీవో ఫణీందర్‌రావు శుక్రవారం సెలవు రోజైన సాయంత్రం వరకు విధులు నిర్వహించారు. నీటి సమస్య ఉన్న పలువురు పంచాయతీ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి అక్కడి పరిస్థితిపై ఆరా తీశారు. నీటిఎద్దడి సమస్యపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలు ప్రస్తావిస్తూ ప్రస్తుతం అక్కడ చేపట్టిన చర్యలపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్య తీవ్రంగా ఉన్నట్లైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు, మోటర్ల మరమ్మతును వెంటనే పరిష్కరించాలన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ, అధ్యాపకులు

భైంసా: అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్‌ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అన్నారు. క్యాంపస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రను విద్యార్థులు తెలుసుకుని, జీవితంలో రాణించాలన్నారు. సంస్కరణల కోసం పదవులు త్యాగం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించినందుకు ఎస్సీ,ఎస్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ విఠల్, కోకన్వీనర్ వసంత్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ వినోద్, శ్రీశైలం, రంజిత్‌కుమార్, డాక్టర్ విజయకుమార్, ప్రకాశ్, ఎస్సీ, ఎస్టీ సెల్ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఎదులాపురం: పట్టణంలో మట్కా స్థావరంపై టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేసి నిర్వాహకుడిని అరెస్టు చేశారు. స్థానిక ఖుర్షీద్‌నగర్‌కు చెందిన లతీఫ్ ఆధ్వర్యంలో అదే కాలనీకి చెందిన షేక్ యూనుస్ మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి మట్కా నిర్వాహకుడు యూనుస్‌ను పట్టుకున్నామని టూటౌన్ ఎస్సై తెలిపారు. అతని నుంచి ఐదు మట్కా చిట్టీలు, రూ.2880 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాటిముంజలకు భలే గిరాకీ



వేసవి తాపాన్ని తీర్చేందుకు శరీరంలో చల్లదనాన్ని అందించేందుకు తాటిముంజలను ఎక్కువగా తీసుకుంటారు. పల్లెటూరి నుంచి పలువురు తాటిముంజలను జిల్లా కేంద్రానికి తెచ్చి విక్రయిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, చెట్ల నీడన వద్ద డజన్‌కు రూ.100 విక్రయిస్తుండగా జనం కొంటున్నారు. వేసవి సీజన్‌లో వీటికి భలే గిరాకీ ఉంటుందని పలువురు చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



